RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

కరీంనగర్ శుక్రవారం 15.05.2026 సంపుటి : 03 సంచిక : 157 పేజీలు : 08 వెల : రూ.5

Karimnagar Friday 15.05.2026 Volume: 03 Issue 157 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక




## వీడిన సస్పెన్స్.. కేరళ సీఎంగా వీడీ సతీశన్

**తిరువనంతపురం:** 11 రోజుల సస్పెన్స్ వీడింది. కేరళ సీఎంగా వీడీ సతీశన్ పేరును కాంగ్రెస్ హైకమాండ్ ప్రకటించింది. ఏఐసీసీ కేరళ ఇంచార్జ్ దీపా దాస్‌మున్సీ గురువారం ఢిల్లీలో జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో సతీశన్ పేరును ప్రకటించారు. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ పార్టీ ఘన విజయం నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే ముఖ్యమంత్రి ఎన్నిక విషయంలో ఉత్కంఠ నెలకొన్నది. సీఎం పదవి కోసం సతీశన్‌తో పాటు కేసీ వేణుగోపాల్, రమేశ్ చెన్నితల తీవ్రంగా పోటీపడ్డారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం కాంగ్రెస్‌కు క్లియర్ మెజారిటీ ఉన్నా.. సీఎం ఎంపిక విషయంలో మాత్రం తీవ్ర జాప్యం జరిగింది.



సీఎం పేరును ప్రకటించేందుకు కాంగ్రెస్ హైకమాండ్ రంగంలోకి దిగాల్సి వచ్చింది.

## సింగరేణిలో మహిళా డంపర్ ఆపరేటర్లు

**హైదరాబాద్, మే 14:** సింగరేణిలో మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకానికి శ్రీకారం చుట్టారు. 13 దశాబ్దాల చరిత్రలో తొలిసారిగా భారీ డంపర్లను మహిళలు నడపనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో 60 నుంచి 100 టన్నుల భారీ డంపర్ల నిర్వహణ కోసం మహిళలకు అవకాశం కల్పించారు. ఇప్పటికే 13 మంది మహిళా ఉద్యోగులు.. భారీ వాహనాల డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేశారు. సిరిసిల్లలోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ ద్వారా మహిళలకు ఉచితంగా ఈ శిక్షణ అందించారు. త్వరలో విడుదల కానున్న డంపర్ ఆపరేటర్ పోస్టుల్లో మహిళలకు




అవకాశం ఇవ్వనున్నారు. పురుషులకు మాత్రమే పరిమితమైన ఉద్యోగాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

# కేటీఆర్‌కు సమన్లు



### జూలై 31న విచారణకు రావాలి

### ఫార్ములా-ఈ కారు రేసు కేసులో ఏసీబీ కోర్టు ఆదేశం

### చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం

**హైదరాబాద్, మే 14 :** ఫార్ములా–ఈ రేసు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఏసీబీ దాఖలు చేసిన చార్జిషీట్‌ను ఏసీబీ కోర్టు పరిగణనలోకి తీసుకుంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సమన్లు జారీ చేసింది. ఈ కేసులో ఏ1 అయిన కేటీఆర్, ఇతర నిందితులైన ఐఏఎస్ అధికారి అరవింద కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి, స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు, ఫార్ములా ఈ ఆపరేషన్స్ సంస్థ ఎఫ్ఈవో అల్బర్ట్‌లను జూలై 31న విచా రణకు హాజరు కావాలని సమన్లలో పేర్కొంది. హైదరాబాద్‌లో ఫార్ములా ఈ కారు రేసు నిర్వ హణకు 2023 అక్టోబరులో ప్రారంభమైన ఒప్పంద ప్రక్రియ తర్వాత ప్రభుత్వ అనుమతి లేకుండానే రూ.55 కోట్లు చెల్లించారన్న ఆరోపణలపై ఏసీబీ 2024 డిసెంబరులో కేసు నమోదు చేసింది. అధికార దుర్వినియోగం, ఆర్థిక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై దర్యాప్తు ప్రారంభించిన ఏసీబీ అధికారులు కేటీఆర్ తదితరులను పలుమార్లు విచారించారు. పలువురు ఐఏఎస్, హెచ్ఎండీఏ, ఆర్థిక శాఖ అధికారులను ప్రశ్నించారు. నిధుల బదిలీలో ఆర్‌బీఐ నిబంధనల ఉల్లంఘన ఆరోపణలపై బ్యాంకుల అధికారులను కూడా విచారించారు. పలు కీలక పత్రాలు, డిజిటల్ ఆధారాలు, బ్యాంకు లావాదేవీలు, ఒప్పంద పత్రాలను ఏసీబీ స్వాధీనం చేసుకుంది. ఈ వ్యవహారంలో మనీ లాండరింగ్ కోణం ఉందన్న ఆరోపణల నేపథ్యం లో రంగంలో దిగిన ఈడీ అధికారులు సైతం కేటీఆర్, అరవింద కుమార్, బీఎల్ఎన్ రెడ్డి తదితరులను విచారిం చారు. విదేశీ సంస్థకు జరిగిన చెల్లింపులు, నిధుల బదిలీ, ఒప్పం దాలపై ఆరా తీశారు. దర్యాప్తులో సేకరించిన ఆధారాలు, వాంగ్మూలాలు, ఆర్థిక లావాదేవీల ప్రకారం గవర్నర్ అనుమతి వచ్చిన తర్వాత ఏసీబీ అధికారులు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. దానిని పరిశీలించిన ఏసీబీ కోర్టు గురువారం అధికారికంగా విచారణకు స్వీకరించి సమన్లు జారీ చేసింది.

## పంజాబ్‌పై శివమెత్తిన తిలక్

### కెప్టెన్‌గా తొలి మ్యాచ్ గెలిపించిన బుమ్రా




పంతొమ్మిదో సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌కు వరసగా ఐదో ఓటమి ఎదురైంది. ధర్మశాలలో తిలక్ వర్మ(75 నాటౌట్) శివమెత్తగా.. ఆఖరి ఓవర్ థ్రిల్లర్‌లో ముంబై ఇండియన్స్ 6 వికెట్ల తేడాతో పంజాబ్‌ను చిత్తు చేసింది. 201 ఛేదనలో శుభారంభం దక్కినా.. మిడిల్ ఓవర్లలో వికెట్లు పడడంతో పంజాబ్ పోటీలోకి వచ్చింది. కానీ, తిలక్ పట్టువదలకుండా ఆఖరిదాకి నిలబడ్డాడు.. చివరి ఓవర్లో 6, 4 తో ముబైకి ఆరు వికెట్ల విజయాన్ని కట్టబెట్టాడు. ఇక కెప్టెన్‌గా తొలి మ్యాచ్‌లోనే బుమ్రా జట్టును గెలిపించాడు.లీగ్ దశలో ఎనిమిది ఓటములతో ప్లే ఆఫ్స్ రేసు నుంచి వైదొలిగిన ముంబై ఇండియన్స్ ఇతర జట్లను దెబ్బతీస్తోంది. ధర్మశాలలో పంజాబ్ కింగ్స్‌పై ముంబై అదిరే విక్టరీ కొట్టింది. భారీ ఛేదనలో పంజాబ్ బౌలర్లను ఉతికేస్తూ తిలక్ వర్మ(75 నాటౌట్) ఒంటిచేత్తో ముంబైకి నాలుగో విజయం అందించాడు. దాంతో..ఈ మ్యాచ్‌లోనైనా గెలిచి ముందుకు వెళ్లాలనుకున్న పంజాబ్ 13 పాయింట్ల వద్దే ఆగిపోయింది.ఆఖరి ఓవర్లలో పట్టుసడలించి పంజాబ్‌ను రెండొందలు కొట్టేందుకు అవకాశమిచ్చిన ముంబై ఛేదనలో ఓపెనర్లు రియాన్ రికెల్టన్(48), ఇంప్యాక్ట్ సబ్ రోహిత్ శర్మ(25)లు శుభారంభమిచ్చారు. రికెల్టన్ బౌండరీల మోతతో స్కోర్ బోర్డును ఉరికించాడు. విజయాన్ని లాగేసుకుంటున్న ఈ జోడీని అజతుల్ల  విడదీశాడు. కాసేపటికే నమన్ ధిర్(9) బిగ్ షాట్ ఆడబోయి అర్ష్‌దీప్ చేతికి చిక్కగా.. చాహల్ ఓవర్లో హిట్‌మ్యాన్ బౌల్డయ్యాడు. తిలక్ వర్మ(75 నాటౌట్), రూథర్‌ఫోర్డ్(20)లు గెలుపు బాధ్యత తీసుకొని భాగస్వామ్యం నిర్మించారు.పంజాబ్ బౌలర్లను కాచుకొని నాలుగో వికెట్‌కు 61 రన్స్ జోడించిన ఈ ద్వయాన్ని అజ్మతుల్ల విడగొట్టాడు. కానీ, తిలక్ తగ్గలేదు. యాన్సెన్ ఓవర్లో లెగ్ సైడ్ సిక్సర్‌తో యాభై పూర్తి చేసుకున్నాడు. యాన్సెన్ ఓవర్లో జాక్స్(25 నాటౌట్) తిలక్ 22.. ఆపై అర్ష్‌దీప్ బౌలింగ్‌లో 19 రన్స్ పిండుకున్నారు. బార్ట్‌లెట్ వేసిన చివరి ఓవర్లో 15 రన్స్ అవసరమవ్వగా.. తొలి బంతినే జాక్స్ స్టాండ్స్‌లోకి పంపాడు. తర్వాత సింగిల్.. నాలుగో బంతికి తిలక్ సిక్సర్ బాదాడు. ఐదో బంతికి బౌండరీ రాగా ముంబై ఆరు వికెట్లతో పంజాబ్‌ను మట్టికరిపించింది.

### ప్రధాని సందేశం..

## కాన్వాయ్ తగ్గించుకోవాలని గవర్నర్ నిర్ణయం

**హైదరాబాద్, మే 14:** పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఇంధన పొదుపు చర్యలు పాటించాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపును తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ఆచరిస్తున్నారు. తన కాన్వాయ్‌ను తగ్గించుకోవాలని గవర్నర్ నిర్ణయం తీసుకున్నారు. దేశ ప్రధాని సందేశానికి తాము మద్దతు ఇస్తున్నామని గవర్నర్ వెల్లడించారు. వాహనాలను తగ్గించే ప్రధాని కార్యక్రమాన్ని తాము అమలు చేస్తున్నట్లు చెప్పారు. లోక్ భవన్‌లో ఇప్పటికే సగం వాహనాలను తగ్గించామని అన్నారు. వాహనాలను తగ్గించడం వల్ల ఖర్చులు తగ్గుతాయని తెలిపారు.



తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, అధికారులు.. ప్రధాని సందేశాన్ని అమలు చేయాలని గవ ర్నర్ కోరారు. తెలంగాణ ప్రజలు కూడా ప్రధాని విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు, కాలేజీలలో ప్రధాని మోదీ సందేశాన్ని లైన్ ఇంప్లిమెంట్ చేయాలని కోరుతున్నట్లు గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల పేర్కొన్నారు.

### తెలంగాణ, ఏపీ సహా 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో

## ‘సర్’ మూడో దశ

**న్యూఢిల్లీ:** దేశంలోని 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల ‘ప్రత్యేక విస్తృత సవరణ’ (సర్) మూడవ దశను ప్రారంభించనున్నట్లు భారత ఎన్నికల సం ఘం (ఈసీఐ) గురువారం ప్రకటించింది. హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్, లడఖ్ మినహా దేశం మొత్తం ‘సర్’ పరిధిలోకి వస్తుందని ఈసీ వెల్లడించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, పంజాబ్, హర్యానా, జార్ఖండ్, కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, మణి పూర్, మేఘాలయ, మిజోరం, నాగా లాండ్, సిక్కిం, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు, దేశ



రాజధాని ఢిల్లీ, చండీగఢ్, దాద్రా–నగర్ హవేలి– దమన్–దియు కేంద్ర పాలిత ప్రాంతాల్లో మూడో దశ ‘సర్’ ప్రక్రియ నిర్వహించనున్నారు.కాగా, ‘సర్’ మూడో దశలో భాగంగా 3.94 లక్షల మందికి పైగా బూత్ స్థాయి అధికారులు (బీఎ ల్వోలు), జనాభా గణనకు రాజకీయ పార్టీలు నియమించిన 3.42 లక్షల మంది బూత్ స్థాయి ఏజెంట్ల (బీఎల్ఏల) సహా యంతో ఇంటింటికి వెళ్లి 36.73 కోట్ల మంది ఓటర్ల వివరాలు తనిఖీ చేస్తారని ఈసీ తెలిపిం ది. మే 30 నుంచి అక్టోబర్ 14 వరకు ‘సర్’ మూడో దశ ప్రక్రియ జరుగుతుందని పేర్కొంది.

## బండి భగీరథ్‌కు

## మధ్యంతర బెయిలుపై నేడు నిర్ణయం

### వాదనలన్నీ విన్నాకే ముందస్తు బెయిల్‌పై నిర్ణయం

### విచారణ వచ్చే వారానికి వాయిదా వేసిన హైకోర్టు

**హైదరాబాద్ :** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్ తనపై నమోదైన పోక్సో కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన మధ్యంతర అప్లికేషన్(ఐఏ)పై శుక్రవారం ఉత్తర్వులు వెలువరిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది.



అయితే, బాధితు రాలికి సంబంధించిన రెండు బర్త్ సర్టిఫికెట్లలో ఏది వాస్తవమో తేల్చాలని సూచించింది. ప్రధాన పిటిషన్ అయిన ముందస్తు బెయిల్‌పై విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

# ప్రతిరోజు ఒక వార్డు కార్యక్రమంలో చందానగర్‌లో సైబరాబాద్ కమిషనర్ క్షేత్రస్థాయి తనిఖీ

**జనోదయ : శేరిలింగంపల్లి :**

'ప్రతిరోజు ఒక వార్డు' కార్యక్రమంలో భాగంగా, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శేరిలింగంపల్లి జోన్ మియాపూర్ సర్కిల్ చందానగర్ వార్డులో క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించారు. చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో జరిగిన ఈ పర్యటనలో శేరిలింగంపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు అరికపూడి గాంధీ , జోనల్ కమిషనర్, డెప్యూటీ కమిషనర్ మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ స్థానిక నివాసితులు, పౌరులతో నేరుగా మాట్లాడి క్షేత్రస్థాయిలో ఇంజ నీరింగ్, పారిశుధ్యం, పార్కులు, క్రీడా మౌలిక సదుపాయాలు, టౌన్ ప్లానింగ్ మరియు ప్రజారోగ్యానికి సంబంధించిన సమస్యలను సమీక్షించారు.స్థానిక నివాసితులు వివిధ విభాగాలకు సంబంధించిన పలు సమస్యలను, మౌలిక సదుపాయాల అవసరాలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.పీజేఆర్ స్టేడియంలో ప్రస్తుతం ఉన్న డ్రైనేజీ కాలువను పునర్నిర్మించాలని కోరారు.పీజేఆర్ స్టేడియంలోని బాడ్మింటన్ కోర్టు పైకప్పు లీకేజీ సమస్యను పరిష్కరించాలని విన్నవించారు.పీజేఆర్ స్టేడియం ఆనుకుని ఉన్న నివాస ప్రాంతాలలో నీటి నిల్వ మరియు డ్రైనేజీ సమస్యలపై ఫిర్యాదు చేశారు.హుడా కాలనీ ఫేజ్-XX లోని ఖాళీ స్థలాల ఆక్రమణలను తొలగించాలని కోరారు. కాలనీల్లోని పార్కులను ఆధునీకరించి, అభివృద్ధి చేయాలని కోరారు.ఇంటింటికీ చెత్త సేకరణ కోసం వచ్చే సాట్ వాహనాలు క్రమబద్ధంగా రావడం లేదని ఫిర్యాదు చేశారు.నివాస కాలనీలలో క్రమం తప్పకుండా రోడ్లను ఊడ్చాలని, పారిశుధ్య సేవలను మెరుగుపరచాలని కోరారు.పలు ప్రాంతాలలో దోమల నివారణకు ముమ్మరంగా ఫాగింగ్ మరియు నివారణ మందుల పిచికారీ చేపట్టాలని విన్నవించారు. ప్రతిరోజు ఒక వార్డు కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం పౌరుల నుండి సమస్యలను నేరుగా తెలుసుకోవడం మరియు క్షేత్రస్థాయిలో సమన్వయ చర్యల ద్వారా వాటిని వేగంగా పరి ష్కరించడమేనని కమిషనర్ పునరు ద్ఘాటించారు.నేరుగా పౌరులతో మమేకమవ్వడం, క్షేత్రస్థాయి పరిస్థి తులను అంచనా వేయడం మరి యు సకాలంలో ఆచరణాత్మక పరిష్కారాలను అమలు చేయడం ద్వారా పౌర సేవలను మరింత బలోపేతం చేయడానికి కార్పొరేషన్ నిరంతరం కృషి చేస్తోందన్నారు.






# ప్రభుత్వ బడుల్లోనే ఒత్తిడి లేని విద్య

**-కృష్ణా కాలనీ స్కూల్‌కు జిల్లా ఫస్ట్, స్టేట్ సెకండ్ ర్యాంక్**

**-అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి ప్రశంస**

**జనోదయ : వరంగల్ ప్రతినిధి:**



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలే సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతారని, ఒత్తిడి లేని విద్య ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే సాధ్యమని వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు. కృష్ణా కాలనీ ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక'లో భాగంగా జరుగుతున్న విద్యా వారోత్సవాల్లో బడిబాట ర్యాలీ, తల్లిదండ్రుల - టీచర్ల సమావేశంలో కలెక్టర్ సంధ్యారాణి ప్రసంగించారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఈ పాఠశాల నుండి జిల్లా మొదటి ర్యాంక్, స్టేట్ రెండవ ర్యాంక్ సాధించడం జిల్లాకే గర్వకారణమని, అందుకు కారకులైన విద్యార్థులు, టీచర్లు, తల్లిదండ్రులను ప్రశంసించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సమగ్ర విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని సూచించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో అద్భుత ప్రతిభ కనపరచిన విద్యార్థులను ప్రత్యేకంగా ప్రశంసించారు. జిల్లా మెడికల్, ఆరోగ్య శాఖాధికారి సాంబశివ రావు పారా మెడికల్ కోర్సు చేస్తున్న విద్యార్థినులకు కెరీర్ గైడెన్స్ ఇచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీర ఉపేందర్ మాట్లాడుతూ.. బడి షిఫ్ట్ పద్ధతిలో నడిచినా ఇంతటి ఫలితాలను సాధించడం ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషి, అంకితభావమేనని, వచ్చే ఏడాది మరిన్ని మెరుగైన ఫలితాలు సాధిస్తామని చెప్పారు. కళాశాల ఇంఛార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస శర్మ లెక్చరర్లు, ఉపాధ్యాయుల కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సందీప్ కుమార్, డాక్టర్ మస్నా వెంకటేశ్వర్లు, గందె రమేష్, భవాని, సదాలక్ష్మి, రాజేష్, చింతం నాగరాజు, లెక్చరర్లు రమణా రెడ్డి, ప్రవళిక, సంగీత, శ్వేత పాల్గొన్నారు.

# 10 రోజుల బైబిల్ క్లబ్‌లో 300 మంది చిన్నారులు

**-25వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు జన్ను శ్యామ్ చేతుల మీదుగా బహుమతులు**

**-వాలిడిక్టరీ ఫంక్షన్‌తో ముగింపు**




**జనోదయ : వరంగల్ ప్రతినిధి:**

వరంగల్ నగరం 25వ డివిజన్ పరిధిలోని సెంటినరీ ట్రినిటీ బాప్టిస్ట్ చర్చి, మండిబజార్ మట్టేవాడలో చిల్డ్రన్ బైబిల్ క్లబ్ (సీబీసీ) 2026 వేడుకలు ఘనంగా ముగిశాయి. 01-05-2026 నుండి ప్రారంభమైన ఈ చిల్డ్రన్ బైబిల్ క్లబ్‌లో 10 రోజుల పాటు సుమారు 300 మంది పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. 13-05-2026 బుధవారం రాత్రి వాలిడిక్టరీ ఫంక్షన్‌తో వేడుకలు చివరి రోజు సెంటినరీ ట్రినిటీ బాప్టిస్ట్ చర్చిలో ఘనంగా నిర్వహించారు. దైవజనులు, సంఘ కాపరి రెవ. డా. బి. వినయ్ కుమార్, రెవ. డా. పగడాల ప్రేమ్ కుమార్ చిన్నపిల్లలను ఉద్దేశించి వాక్య సందేశం అందించారు. పిల్లలకు క్రీడా కార్యక్రమాలు ఎంతో ఉత్సాహంగా జరిగాయి.మ్యూజికల్ చైర్స్‌లో విజేతలకు, సండే స్కూల్ చిన్న పిల్లలకు, టీచర్లు అరుణ, జన్ను లతకు 25వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు జన్ను శ్యామ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో సంఘ ప్రెసిడెంట్ పి.ఆర్. విజయ్ కుమార్, సెక్రెటరీ జె.జె. విల్సన్, ట్రెజరర్ జె.ఎన్. శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ జన్ను కరుణాకర్, సండే స్కూల్ సూపరింటెండెంట్ జన్ను ఎలిషా రవి, సండే స్కూల్ డైరెక్టర్ జన్ను రవళి తేజ, జన్ను సుమిమోన్ పాల్, జన్ను అనిల్, జన్ను రమేష్, స్థానిక సంఘ పెద్దలు పాల్గొన్నారు.

# నేతల కాన్వాయ్‌లు తగ్గించండి

**-డీజిల్ పెట్రోల్ వద్దు.. బ్యాటరీ సోలార్ ముద్దు**

**-గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి**

**జనోదయ : వరంగల్ ప్రతినిధి:**

పెట్రోల్, డీజిల్, గ్యాస్ రేట్లతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారని, ప్రతి ఒక్కరూ సైకిల్, బ్యాటరీ, సోలార్ వాహనాలు వాడాలని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి పిలుపునిచ్చారు. వరంగల్ చౌరస్తాలో ఆయన ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఏ దేశంలో యుద్ధం జరిగినా దాని ఎఫెక్ట్ భారత్‌పై పడుతుందని, దానివల్ల ఇంధనం టైముకు అందక, రేట్లు విపరీతంగా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాత రోజుల్లో సైకిల్ వినియోగం గొప్పదని, దానివల్ల ఆరోగ్యంతో పాటు ఆర్థిక భారం తగ్గుతుందని అన్నారు. విదేశాలపై ఆధారపడొద్దని, పెట్రోల్, డీజిల్ ఆదా చేయాలని సూచించారు. ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ సెక్యూరిటీ వాహనాల కాన్వాయ్‌లను తగ్గించుకోవాలని కోరారు. నేతలను చూసి ప్రజలు స్ఫూర్తి పొంది సైకిల్ బాట పడతారని అన్నారు.



ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మూలపాక ప్రసాద్, మాగంటి శివ, గంద్రకోట రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్ల సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్ల హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

# కుల బహిష్కరణ నేరం

## కఠిన చర్యలు తీసుకుంటాం ఆర్డీవో గంగయ్య , ఏసీపీ మడత రమేష్

జనోదయ : రామగుండం రూరల్

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ముర్మూరు గ్రామపంచాయతీ పరిధిలోని ముర్మూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో కుల బహిష్కరణపై విచారణకు గోదావరిఖని ఏసీపీ మడత రమేష్,రెవెన్యూ డివిజనల్ అధికారి గంగయ్య, సిఐ కృష్ణకుమార్ హాజరయ్యారు. ఎల్లంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన నక్క కొమురయ్య కుటుంబాన్ని అతని సామాజిక తరగతికి చెందిన సంఘ నాయకులు వెలివేశారని నక్క కొమురయ్య అంతర్గాం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.గత నాలుగు సంవత్సరాలుగా నక్క కొమురయ్య కుటుంబానికి శుభకార్యాలకు మంచి చెడుకులకు దేవుని కొలువులకు ఆహ్వానం ఇవ్వకుండా,సంఘ నాయకులు అడ్డుకుంటున్నారని ఉన్నతాధికారులకు పిర్యాదు చేశాడు. ఈ నెల కొమురయ్య ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా వారి ఆదేశాలతో రెవెన్యూ డివిజనల్ అధికారి గంగయ్య, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ సంయుక్తం గా ముర్మూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బాధితులు, గ్రామస్థులు సమక్షంలో విచారణచేపట్టారు.కుల బహిష్కరణ నేరమని ఏ కులంలో నైనా ఎవరైనా కులబహిష్కరణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో గంగయ్య ,ఏసీపీ మడత రమేష్ హెచ్చరించారు.అలాగే ఏసీపీ మడత రమేష్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి రాజ్యాంగం ఇచ్చిన వ్యక్తిగత పౌర హక్కులు ఉంటా



యి.... ఆధునిక సమాజంలో కులకట్టడి పేరున ఎవరి హక్కులకు భంగం కలిగించిన కులబహిష్కరణ చేసిన తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుందన్నారు.కుల సంక్షేమం కోసం ఉండే సంఘాన్ని వ్యక్తిగత కక్ష్య సాధింపులకు వివక్షకు గురిచేస్తే కుల కట్టడి అనే అంశం చట్టబద్ధం కాదని,వారిపై చట్టబద్ధంగా కఠిన చర్యలు తీసుకుంటాము...ఎవరైనా కులబ హిష్కరణ గురైతే స్థానికంగా ఉండే పోలీస్ అధికారులను సంప్రదిం చండన్నారు.ఆర్డీవో గంగయ్య మాట్లాడుతూ కులం పేరిట వివక్ష అణచివేత అవమానాలకు ఎవరైనా గురి చేస్తే స్థానిక ఎమ్మార్వో దృష్టికి తీసుకురండి.మేజర్లు అయిన వారికి వివాహ హక్కు ఉంటుంది.కులాంతర వివాహాలు చేసుకున్నారని కుల కట్టడి పేరున ఎవరైనా వేధింపులకు గురిచేస్తే రెవెన్యూ అధికారి అంతర్గాం తహసిల్దార్, స్థానిక పోలీసు అధికారులకు నిర్భయంగా ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య ,అంతర్గాం తహసిల్దార్ తూము రవీందర్ పటేల్, రామగుండం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కృష్ణ కుమార్, అంతర్గాం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బోగే వెంకటస్వామి, గ్రామ సర్పంచ్ మగ్గిడి స్వరూప- శ్రీనివాస్ గ్రామ ప్రజలు,వివిధ శాఖల అధికారులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అధికారులు అంకితభావంతో పనిచేయాలి

-వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



జనోదయ : వరంగల్ ప్రతినిధి:

స్టేషన్ అధికారులు అంకితభావంతో పనిచేస్తూ ప్రజల అభిమానాన్ని పొందాలని వరంగల్ సీపీ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీతిసింగ్ ఆదేశాల మేరకు హసన్‌పర్తి, కాజీపేట పోలీస్ స్టేషన్ల నూతన ఇన్స్ స్పెక్టర్లుగా బాధ్యతలు చేపట్టిన ఇన్స్పెక్టర్లు మహేందర్, శ్యాంసుందర్ గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్‌ను సిపి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. నిజాయితీతో విధులు నిర్వహిస్తూ, బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ, పోలీస్ స్టేషన్లో న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని బాధితులకు కలిగించాలని పోలీస్ కమిషనర్ నూతన ఇన్స్ స్పెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు.






## సింగరేణి అర్జీ-1లో ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుపై సమీక్ష

జనోదయ : గోదావరిఖని

సింగరేణి సంస్థలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతను మెరుగుపరిచే లక్ష్యంతో మల్టీ డిపార్ట్‌మెంటల్ టీమ్ ఆధ్వర్యంలో గురువారం రామగుండం ఏరియా-1 జియం కార్యాలయ సెమినార్ హాలు నందు సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఏరియా జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు కీలక అంశాలపై చర్చించారు. నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలు,యంత్రాల పనితీరు, యంత్రాల పని గంటలను సమర్థవం తంగా వినియోగించుకోవడం, ఏరియా



మరియు కంపెనీ స్థాయిలో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే మార్గాలపై సమీక్ష చేపట్టారు. వివిధ విభాగాల మధ్య సమన్వయాన్ని పెంచి, ఉత్పత్తిలో ఎదురయ్యే ఆటంకాలను అధిగమించడంపై జియం మాట్లాడుతూ సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి అధికారులు మరియు కార్మికులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జిఎం కె. చంద్రశేఖర్, ఏరియా ఇంజనీర్ రామోహన్ రావు, ఎజంట్స్, పర్సనల్ ఫైనాన్స్ విభాగాల అధిపతులు, ఐఈడి, క్వాలిటీ కంట్రోల్ విభాగాల అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం, మే 18 నుండి అన్ని గనుల వారీగా కార్మికులతో కూడా ఇటువంటి అవగాహన సమావేశాలు నిర్వహించనున్నట్లు జియం తెలిపారు.

## రెవెన్యూ అధికారుల సంఘం ఏర్పాటు

జనోదయ : డి. హీరేహాళ్ మే 14

మండల గ్రామ రెవెన్యూ అధికారుల సంఘాన్ని గురువారం నాడు ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ తాసిల్దార్ సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఏర్పాటు కోసం ఎన్నికల అధికారులుగా డిప్యూటీ తాసిల్దార్ సురేష్ బాబు రెవెన్యూ ఇన్స్పెక్టర్ సాయికృష్ణవంశీల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఇందులో భాగంగా మండల రెవెన్యూ సంఘం అధ్యక్షులుగా టి. శివరాజు, ఉపాధ్య క్షులుగా బి. వరదరాజు, కార్యదర్శిగా బి. పెద్దయ్య, కోశాధికారిగా



పి.వినయ్ కుమార్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా మధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడిన సభ్యులను రెవెన్యూ సిబ్బంది శాలువా పూలమాలలతో సత్కరించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడ్డ సభ్యులు మాట్లాడుతూ తమపై ఉన్న నమ్మకంతో ఇంతటి బాధ్యతలను అప్పగించినందుకుగాను నిరంతరం రెవెన్యూ సమస్యలపై దృష్టి సారించి వాటి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమం నందు వీఆర్వోలు జైపాల్, నాగరాజు, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు,

## రైల్వే లైన్ నిర్వాసితులకు
# పునరావాసం దిశగా అడుగులు

**జనోదయ : గంగాధర మే 14:**

కురిక్యాలలో భూమి పరిశీలనకొత్తపల్లి – మనోహరాబాద్ రైల్వే లైన్ నిర్మాణ పనుల నేపథ్యంలో ఇళ్లు కోల్పోతున్న రంగారావుపల్లి, కాసారం గ్రామాల రైతు కుటుంబాలకు పునరావాసం కల్పించే దిశగా అధికారులు చర్యలు వేగవంతం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కురిక్యాల గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 518లో ఇండ్ల స్థలాల కేటాయింపుకు అనువైన భూమిని కరీంనగర్ ఆర్డీఓ మహేశ్వర్, గంగాధర తహశీల్దార్ రజిత, పరిశీలించారు.పునరావాసానికి అవసరమైన భూమి స్థితిగతులు, రహదారి సౌకర్యం, నివాసయోగ్యత తదితర అంశాలను అధికారులు పరిశీలించి సంబంధిత వివరాలు సేకరించారు. రైల్వే లైన్ పనుల కారణంగా ఇళ్లు కోల్పోతున్న కుటుంబాలకు ప్రభుత్వం తరఫున న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.ఈ పరిశీలన కార్యక్రమంలో మండల సర్వేయర్ కుమార్, ఆర్ఐ సంతోష్ కుమార్, ఆర్డీవో కార్యాలయ ఎస్ఏ షరీఫ్, జేఏ వినోద్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు కూడా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



## బండి భగీరథ్‌కు
# మధ్యంతర బెయిలుపై నేడు నిర్ణయం

**హైదరాబాద్ :** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్ తనపై నమోదైన పోక్సో కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన మధ్యంతర అప్లికేషన్ (ఐఏ)పై శుక్రవారం ఉత్తర్వులు వెలువరిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే, బాధితురాలికి సంబంధించిన రెండు బర్త్ సర్టిఫికెట్లలో ఏది వాస్తవమో తేల్చాలని సూచించింది. ప్రధాన పిటిషన్ అయిన ముందస్తు బెయిల్‌పై విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. తనపై పేట్‌బషీరాబాద్ పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని, ఒకవేళ అరెస్టు చేసినా వెంటనే బెయిల్‌పై విడుదల చేసేలా మధ్యంతర ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ బండి భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టీ మాధవీదేవి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. అయితే, ఈ కేసులో సత్వర విచారణపై బాధితురాలి తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేయగా.. బాధితురాలి తరఫు వాదనలు వినకుండా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వమని న్యాయస్థానం తేల్చిచెప్పింది. విచారణ సందర్భంగా ఇరుపక్షాల న్యాయవాదుల తీరుపై ధర్మాసనం కొంత అసహనం వ్యక్తం చేసింది. భగీరథ్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్ నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. విచారణకు హాజరుకావడానికి, సాక్ష్యాలను సమర్పించడానికి భగీరథ్ సిద్ధంగా ఉన్నారని, తాము కేసును కొట్టేయమని కోరడం లేదని, అరెస్టు నుంచి రక్షణ మాత్రమే కోరుతున్నామని తెలిపారు. సుప్రీం కోర్టు గత తీర్పుల ప్రకారం ఈ కేసులో భగీరథ్ బెయిల్‌కు అర్హుడని, ప్రస్తుతానికి మధ్యంతర ఉపశమన ఉత్తర్వులివ్వాలని కోరారు. ప్రభుత్వం తరఫున పీపీ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. 'బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు ముందుగా కేసు నమోదు చేశారు. బాధితురాలి వాంగ్మూలం రికార్డు చేసిన తర్వాత సెక్షన్లు మార్పు చేశారు' అని చెప్పారు. బాధితురాలి తరఫున న్యాయవాది పప్పు నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. నిందితుడు పరారీలో ఉంటూ ముందస్తు బెయిల్ కోరడం విడ్డూరంగా ఉందని, అంతేకాక అంత అత్యవసరం బెయిల్ కోరడం సరికాదన్నారు.మధ్యంతర ఉపశమన ఉత్తర్వులిస్తే ముందస్తు బెయిల్ ఇచ్చినట్లేనని తెలిపారు. నిందితుడికి బెయిల్ వస్తే బాధితురాలు, ఆమె కుటుంబాన్ని వేధింపులకు గురి చేసే అవకాశం ఉందన్నారు. బాధితురాలి స్టేట్‌మెంట్‌ను కోర్టుకు సమర్పించేలా ఆదేశాలివ్వాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ముందస్తు బెయిల్ మధ్యంతర అప్లికేషన్‌పై వాదనలు విని శుక్రవారం ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. ప్రధాన పిటిషన్‌లో విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు. కాగా, మధ్యంతర రక్షణపై తీర్పును న్యాయస్థానం శుక్రవారానికి వాయిదా వేసింది. దీంతో ఇప్పటికే పోలీసులు ఇచ్చిన నోటీసులకు విచారణకు తప్పక హాజరుకావాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో బండి భగీరథ్ శుక్రవారం పోలీసు విచారణకు వస్తాడా? లేదా కోర్టు తీర్పు వచ్చే వరకు ఆగుతాడా ? అనేది చూడాలి.బండి భగీరథ్‌పై నమోదైన కేసులో బాధిత బాలికపై సోషల్ మీడియాలో కొందరు ప్రదర్శిస్తున్న అత్యుత్సాహంపై పోలీసులు దృష్టి సారించారు. పోక్సో కేసు విచారణ జరుగుతున్నపుడు ఆ బాలిక ఫొటోలు, వీడియోలు, ఆమె



గుర్తింపునకు సంబంధించిన వివరాలను ఎలక్ట్రానిక్, డిజిటల్, ప్రింట్ మీడియాలో ఏ విధంగా వాడినా వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. బాధితురాలిని కించపరిచేలా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు పెట్టిన యూజర్లను సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు గుర్తిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా మైనర్ బాలిక సమాచారాన్ని వైరల్, షేర్, రీపోస్టు చేసిన వారిపై పోక్సో కేసులు నమోదు చేస్తామని పోలీసులు వెల్లడించారు. పరారీలో ఉన్న భగీరథ్ కోసం గాలింపు కొనసాగుతోందని సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ ఉన్నతాధికారులు తెలిపారు. హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, కరీంనగర్ ప్రాంతాల్లో అతని ఆచూకి కోసం ప్రత్యేక బృందాలు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నాయి. భగీరథ్ స్నేహితుల ఇళ్లపై కూడా నిఘా పెట్టాయి. మరోవైపు తనపై లైంగికదాడి యత్నం జరిగిందని బాధితురాలు పేర్కొన్న ప్రదేశాల్లో గురువారం సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిర్వహించిన పోలీసులు పలు ఆధా రాలు సేకరించారు. అలాగే, భగీరథ్ స్నేహితులు, బాలిక మిత్రుల నుంచి కూడా సమాచారం సేకరిస్తున్నారు. బాలిక వయస్సుకు సంబంధించి ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ ఆసుపత్రిలో జారీ అయిన బర్త్ సర్టిఫికెట్ ఆధారంగా ఆమె వయస్సును నిర్ధారించే పరీక్షలను ప్రభుత్వ వైద్యుల సమక్షంలో పోలీసులు చేపట్టినట్లు తెలుస్తోంది.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



**జనోదయ : ముప్కాల్ :** మండల కేంద్రంలోని వేంపల్లి గ్రామంలో గురువారం జరిగిన పాఠశాల విద్యార్థుల సన్మానం కార్యక్రమంలో కర్ణ ఫౌండేషన్ ముఖ్య అతిథి రాణా ప్రతాప్ మాట్లాడతూ ప్రతి మనిషి సేవ దృష్టిలో కొన సాగాలని అపుడే వ్యక్తిత్వం ఉన్నతంగా మారుతుందని అన్నారు. వేంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇటీవల నవోద యకు ఎంపైకిన తెలు సహస్రనుశాలువాతో సన్మానం చేశారు. గురుకులానికి ఎంపికైన 28 మంది విద్యార్థులను ఆయన అభినందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు రంజిత్ గౌడ్, చిట్టి పటేల్ ఎంపికైన విద్యార్థులకు, ప్రధానోపా ధ్యా యులు శైవ శ్రీనివాస్ జ్ఞాపిక అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గంగా ప్రసాద్, ఎస్ఎంసీ సభ్యులు నవీన్, ఉపాధ్యాయ బృందం,సతీష్,యశ్వంత్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే
# నాణ్యమైన బోధన



**జనోదయ : ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా వారోత్సవాల్లో భాగంగా గురువారం బడిబాట' కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా విద్యార్థులను, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఎలగందుల నరసింహులు మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. అర్హులైన పిల్లలందరినీ బడిలో చేర్పించి, గ్రామాన్ని వంద శాతం అక్షరాస్యత కలిగిన గ్రామంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుమల మనోహర చారి మాట్లాడుతూ....తమ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్యాబోధనతో పాటు, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట విద్యాధికారి కృష్ణ హరి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సభ్యులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో మెడికల్ క్యాంప్



**జనోదయ : అందోల్**

స్థానిక నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జోగిపేటలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్.పి .రమేష్ అధ్యక్షతన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక-99 రోజులలో భాగంగా విద్యా వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం కళాశాలలో మెడికల్ క్యాంప్ విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. మెడికల్ క్యాంప్ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఏరియా హాస్పిటల్ జోగిపేట నుండి ఐతీ. ఎం.అశోక్ పీడియాట్రిస్ట్ , ఫార్మసిస్ట్ నర్సింగ్ సిబ్బంది కళాశాలకు విచ్చేసి విద్యార్థిని విద్యార్థులకు హెల్త్ టిప్స్ డిహైడ్రేషన్ ఇతరత్రా విషయాల పైన అవగాహన కల్పిస్తూ ఐరన్ మాత్రలు ఓ ఆర్ ఎస్ అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మెడికల్ క్యాంపు తల్లిదండ్రుల సమావేశాలు విద్యార్థిని విద్యార్థులకు అవగాహనను కల్పిస్తూనే, వారి ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడుతాయని వారు వివరించారు.